# పెద్దల న్యాయం

సీతమ్మ, ఆమె వెంట కుంటుకుంటూ ఆమె కొడుకు సుబ్బడూ, ఆ చీకట్లో రావటం చూసి 'దీని మొగుడు కాలం చేసి ఎన్నాలయిందిరా?' అని చెలమయ్యని అడిగాడు సిమ్మాచెలం. చెలమయ్య వెంటనే జవాబు చెప్పలేదు.

చెలమయ్య ఆ వచ్చిన సీతమ్మని కళ్లారా చూస్తున్నాడు. ఊళ్లో రోజూ చూస్తున్న మనిషే సీతమ్మ. అయినా ఇప్పుడు ఈ తగువు మూలంగా పెద్ద మనుషుల మధ్యకి వచ్చింది.

సర్పంచి ఇంటి దగ్గర ఊరు పెద్దలు తగువు తీర్చడానికి ఆ రాత్రి ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో వచ్చి ఆ అరుగుల మీద కూర్చున్నారు. అంతా భోజనాలు చేసి వచ్చారు. దీన్ని తగువు అనాలో, అనకూడదో వాళ్లకి సైతం అర్థం కావటం లేదు. కాని సూరయ్యకు ఆ ఊళ్లో ఉన్న పలుకుబడి వల్లా, అతడు పట్టుపట్టటం వల్లా సర్పంచి సరే అన్నాడు.

సీతమ్మ కొడుకు సుబ్బడు ఊరుకు దాదాపు నాలుగు ఫర్లాంగుల దూరంలో వాళ్ల తోటలో మూడు పాడిగేదెలు చూసుకుంటున్నాడు. నిండా ఎకరం కూడా లేని ఆ తోటలో ఆ గేదెలకోసం రెండు పూటలు వాడు కావిడితో కుడితి, నీళ్లు తీసుకుని వెళ్లి వాటిని ఇమ్ముచేసి వస్తాడు. వాడి తల్లి సీతమ్మ రోజూ ఊరికి మైలుదూరంలో ఉన్న

బజారులో పండ్లూ కూరగాయల వ్యాపారం చేస్తుంది. ఉదయం ఆరు గంటలకు, నెత్తిన గంపపెట్టుకుని మోసుకెళ్ళిన పండ్లూ కాయగూరలూ అమ్ముకుని, వచ్చేటప్పుడు తనకు కావలిసిన సరుకులు కొనుక్కుని వస్తుంది. కొన్నిసార్లు ఇరుగు పొరుగు వాళ్లు తెమ్మన్న వాటిని తెచ్చి వాళ్లకి ఇస్తుంది. తల్లీ కొడుకులు ఇద్దరే. కొడుకు వ్యవసాయం పనుల్లో అందొచ్చాడు. వయసు ఇంకా పదహారేళ్లు నిండకపోయినా కాయకష్టంతో బలంగా పెరిగాడు. నలుగురు చేసే పనిని ఒక్కడే చేయగల చేవపట్టాడు.

రెండోసారి సిమ్మాచెలం అడిగినప్పుడు, 'రెండు పంటలు దాటిందో ఏమోరా... ఆడు దసరా రోజుల్లో తుపాను రోజున కదా సచ్చిపోయినాడు' అని గుర్తు చేసుకుని చెప్పాడు చెలమయ్య.

'కూకోండి' అన్నాడు వాళ్లను చూసి సిమ్మాచెలం.

సర్పంచి ఇంటి ముందు పంచలో నుంచున్న సీతమ్మనీ సుబ్బడునీ అక్కడ వెలుగుతున్న పెట్రోమాక్స్‌లైట్ కాంతిలో అందరూ చూశారు. వాళ్ల ముఖాల్లో అక్కడకు వచ్చినందుకు భయం, అవమానం కనిపిస్తున్నాయి.

సుబ్బడు నేలమీద కూర్చోలేకపోయాడు. పిర్రలమీద పచ్చినొప్పి. సూరయ్య మధ్యాహ్నం కొట్టిన దెబ్బలతో వాడి ఒళ్లంతా పచ్చిపుండులా ఉంది. వాడు ఆ నొప్పితో కింద నేలమీద కూర్చోలేక నుంచున్నాడు. సీతమ్మ మాత్రం కూర్చుంది.

పెద్ద మనుషులు అంతా ఆ తల్లీ కొడుకుల్ని చూసిన తర్వాత ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. వాళ్లల్లో ఎవరికీ సీతమ్మ అంటే చెడ్డ అభిప్రాయం లేదు. అందుచేత దయతోను, ప్రేమతోనూ ఆ తల్లీ కొడుకుల్ని చూశారు.

సర్పంచి ఇల్లు విశాలమైంది. ఆ అరుగులమీద నలభై ఏభైమంది కూర్చోవచ్చు. పెద్ద పెంకుటిల్లు. అట్లాంటి పెంకుటిళ్లు ఆ ఊళ్లో ఆరేడుకన్నా ఎక్కువలేవు. ఆ పెంకుటిళ్లలో పెద్దది సూరయ్యది. ఆ సూరయ్య పెట్టించిందే ఈ తగువు.

ఆ సూరయ్య కొడుకు రవీంద్రబాబు సుబ్బడి ఈడువాడే. పట్నంలో చదువుకుంటున్నాడు. ఎండాకాలం సెలవులకి వారం దినాల క్రిందటే ఇంటికి వచ్చాడు. రవీంద్రబాబు ఊరు వచ్చినప్పుడల్లా వాళ్ల కొబ్బరి తోటల్లో ఓ పూట తిరిగిరావటం వాడికి ఇష్టం. అక్కడ ఆ తోటల్లో వాళ్ల కంబార్లుంటారు. వాళ్లు రవీంద్రబాబుకు అన్ని మర్యాదలూ చేస్తారు.

అది కొబ్బరి తోటల దేశం. కొబ్బరి తోటల మధ్య ఊళ్లు. చుట్టూ తోటలు. ఆ తోటల్లో మధ్య మధ్య మామిడి చెట్లూ, జీడిచెట్లూ, పనసచెట్లూ, కొన్ని కొన్నిచోట్ల

అరటితోటలు. ఇంకా అనేక రకాల పండ్ల చెట్లు... అందాల దేశం అది. ఆ తోటలు దాటితే పొలాలు. ఆ పొలాలకు ఆనుకునే సముద్రం ఒడ్డు, సముద్రం హోరు.

అట్లా రవీంద్రబాబు ఓ ఉదయప్పూట తోటకి వెళ్లినప్పుడు పుట్టిందీ అగ్గి.

సుబ్బడి తోట దాటి వెల్లాలి సూరయ్య పెద్ద కొబ్బరి తోటకి. ఆ తోట ఇరవై ఎకరాల ఏక ఖండం. ఆ తోటకు వెళ్తూ రవీంద్రబాబు మధ్యలో సుబ్బడు కనిపిస్తే ఆగి ముచ్చట్లు పెట్టుకున్నాడు. పచ్చిజీడి పిక్కలు ఒలిచి రవీంద్రబాబుకి జీడిపప్పు ఇచ్చాడు సుబ్బడు. ఒక మామిడి పండు కూడా కోసిపెట్టి మర్యాద చేశాడు.

'ఒరే సుబ్బా, తువ్వాలు మడతపెట్టి కిందేసుకుని కూకోరా' అని ఆ పెద్దమనుషుల్లో ఒకరు చెప్పారు. తువ్వాలు మడత పెట్టి వేసుకుని కూర్చుంటే నొప్పి బాధపెట్టదని ఆ పెద్దమనిషి ఉద్దేశం. సుబ్బడు భుజాన ఉన్న తువ్వాలు తీసి మడతలుపెట్టి గచ్చునేలమీద వేసుకుని కూర్చున్నాడు. నొప్పి అయితే ఉందికాని కూర్చోగలుగుతున్నాడు.

సీతమ్మ కళ్లు కిందికి దించుకుని పెద్దల పట్ల గౌరవంగా ఒళ్లు దాచుకుని కూర్చున్నది. సీతమ్మ ఎప్పుడూ సర్పంచ్ ఇంటిముందుకు ఇట్లాంటి తగువులకు రాలేదు. అందువల్ల ఆమెకి అవమానంగా ఉంది. బాధగా ఉంది. కోపంగా కూడా ఉంది. తన కొడుకును సూరయ్య పశువును బాదినట్టు బాదడమే కాకుండా... అవి తిట్లుకావు, అట్లాంటి బూతులు తిట్టినాడు.

అరుగుమీద గోడకి చేరగిలబడి సర్పంచి కూర్చున్నాడు. సర్పంచికి అటూ ఇటూ నారాయణ, చెలమయ్య, సిమ్మాచెలం, లచ్చుమయ్య, రాజన్నాయుడు రామరాజు, వెంకటస్వామి, సూరిబాబు కూర్చున్నారు. వాళ్లంతా దాదాపు నలభై ఏభయ్యేళ్ల మధ్యవయసువాళ్లు. వాళ్లల్లో ఒక్క రాజన్నాయుడు మాత్రమే డెబ్బయి ఏళ్లు పైబడ్డవాడు. వాళ్లలో చిన్నవాడు సూరిబాబు ఒక్కడే. పాతికేళ్లు కూడా నిండలేదు. తండ్రి చనిపోయిన తర్వాత ఇప్పుడిప్పుడు సూరిబాబు ఈ పెద్దమనుషుల్లో చేరాడు. వాళ్లల్లో డిగ్రీవరకు చదవుకున్నవాడు వాడొక్కడే. వాళ్లల్లో కొందరి నుదుట తిరుచూర్ణం నామాలు ఉన్నాయి. వాళ్లలో ఒకరిద్దరు తప్ప అందరూ టైలర్ కుట్టిన బనీనులూ, పంచెకట్టులూ, భుజం మీద తువ్వాళ్లూ వేసుకున్నవాళ్లే. ఒకరిద్దరు తప్ప మిగిలిన వాళ్లంతా జుత్తు క్రాఫ్ చేయించుకున్నవాళ్లే. రాజన్నాయుడు మాత్రం జుత్తు వెనక్కి ముడి వేసుకున్నాడు. మనుషుల వేషభాషల్లో, ఆచారవ్యవహారాల్లో వైష్ణవ సంప్రదాయ పద్ధతులు ఆ ఊళ్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

ఇంకా ఒకరిద్దరు పెద్దమనుషులు రావలసి ఉంది. పోతే తగువు పెట్టిన సూరయ్య ఇంకా రాలేదు. సూరయ్యకోసమే అంతా ఇప్పుడు ఎదురు చూస్తున్నారు.

సూరయ్య పెద్దమనుషుల్లో లేడు. అయితే సూరయ్య మనుషులు ఈ పెద్దమనుషుల్లో నలుగురయిదుగురు ఉన్నారు. స్వయంగా సర్పంచి సూరయ్య మనిషే.

సర్పంచి భార్య పద్మావతమ్మకు ఈ తగువు అర్థం కాలేదు. సీతమ్మ కొడుకు సుబ్బడిని, భుజాన కావిడేసుకుని తోటనుండి పొద్దు తిరిగిన వేళ ఇంటికి వస్తున్నప్పుడు, సూరయ్య చేతికర్రతో పశువును బాదినట్టు బాదినాడని ఊళ్లో చెప్పుకున్నారు. ఆ గుంటడు అమ్మో అయ్యో అమ్మో బాబో... అని ఏడ్చి ఏడ్చి అక్కడే పడిపోయినాడు. అట్లా దెబ్బలు తిన్నవాడికి ఇంకా శిక్ష సరిపోలేదని ఈ తగువు. అదీ కాకుండా ఈసారి సుబ్బడి తల్లిని కూడా పెద్దమనుషుల మధ్యకి పిలిపించారు. ఆడమనిషిని తగువుకి పెద్దమనుషుల మధ్యకి పిలిపించటం చాల తక్కువ. అత్తాకోడళ్ల మధ్య, ఇరుగు పొరుగు ఆడవాళ్ల మధ్య, తల్లీ కూతుళ్ల మధ్య, అక్కా చెల్లెళ్ల మధ్య, తోటికోడళ్ల మధ్య ఆడవాళ్ల తగువులు వచ్చినప్పుడు లేదా భార్యాభర్తలమధ్య తగువులు వచ్చినప్పుడు సర్పంచి ఆ ఇద్దరి ముగ్గుర్ని మాత్రమే పిలిపించి కోప్పడి పంపించటం జరుగుతుంది. కొన్నిసార్లు పెద్దమనుషుల్లో ఎవర్నో ఒకర్ని పిలిచి 'సూద్రా... ఈ గొడవేమిటో' అని చెప్పడమో, లేదా ఆ తగువు చేసిన వాళ్లకు 'రాజన్నాయుడు బావుతో చెప్పు... ఆ బాబు ఏంచెప్తే అది వినండి... మల్లా నాకాడకి రావద్దు' అని చెప్పడమో ఆనవాయితీ. కొన్ని కొన్ని సందర్భాల్లో భార్య పద్మావతమ్మని పిలిచి' 'ఆ కాంతమ్మ ఏడుస్తున్నది, ఏమిటో విను' అని ఆమెకు అప్పజెప్పిన తగువులు కూడా ఉన్నాయి.

పద్మావతమ్మ అట్లాంటి సందర్భాల్లో ముందు ఇంటి పనులు ఆ తగువు తెచ్చిన ఆడమనిషికి అప్పజెప్తుంది. వాళ్లు పెద్దకులాల వాళ్లయితే వంటగదికి పిలిచి కాయగూరలు తరిగించటం, పిండి రుబ్బించటం లాంటి పనులు. పేదవాళ్లయితే, చిన్న కులాల వాళ్లయితే ఇల్లుకడిగించటం, బిందెలు తోమించటం లాంటి పనులు చెప్పి వాళ్లతో ఆ పనులు చేయిస్తున్నప్పుడే వాళ్ల మాటలు, వాళ్ల బాధలు, వాళ్ల సమస్యలు విని వాళ్లకు తినటానికి ఏమన్నా ఇచ్చి, వాళ్లు పస్తుఉన్నట్టు తెలిస్తే అన్నంపెట్టి మంచిమాటలు చెప్పి పంపించటం మామూలు. కాయోపండో వాళ్లకి పెట్టే స్వభావం పద్మావతమ్మది. అట్లాంటిది ఇవాళ సీతమ్మను పెద్దమనుషుల మధ్యకి పిలిపించటం ఆమెకి కొత్తగా ఉంది.

సీతమ్మ అంటే పద్మావతమ్మకి అభిమానానికి మరొక కారణం కూడా ఉంది. వాళ్లిద్దరి కన్నవారి ఊరు ఒక్కటే. ఇద్దరికీ ఒక ఏడాదే పెళ్లయి ఈ ఊళ్లో అడుగుపెట్టారు. ఆ చనువుతో కూడా సీతమ్మ ఎప్పుడన్నా వచ్చి కష్టం సుఖం చెప్పుకుని వెళ్లేది. దాని మొగుడుపోయిన తర్వాత సీతమ్మ తల్లీ తండ్రీ వచ్చి ఇక్కడ దాదాపు రెండునెలలకు పైగానే ఉన్నారు. వాళ్లు వచ్చినప్పుడల్లా పద్మావతమ్మను చూసి వెళ్తారు.

దాంతో ఈ తగువు పద్ధతి పద్మావతమ్మకి నచ్చలేదు.

ఇవాళ మధ్యాహ్నం పొరుగూరు నుండి ఆమె ఆడపడుచు, పిల్లలు వచ్చారు. వాళ్లతో సందడిగా ఉండిపోయింది. ఈ తగువు సంగతి భర్తని అడిగి తెలుసుకోవాలని అనిపించనందుకు కూడా ఆమె ఇప్పుడు నొచ్చుకుంటున్నది.

అక్కడ ఉన్న పెద్దమనుషుల గురించి తెలిసిన మనిషి కాబట్టి వాళ్లు ఏంచేస్తారో కూడా ఆమె ఊహించగలదు.

సూరయ్య పెత్తోటలో సుబ్బడు తేనె దొంగతనం చేశాడు. దొంగతనం తగువు. ఆ తేనెముంత ఇప్పుడు సుబ్బడు ఇంట్లోనే ఉంది. ఇంతకన్న వేరేసాక్ష్యం ఏంకావాలి. ఇది ముమ్మాటికీ దొంగతనమే. సుబ్బడు తేనె దొంగతనం చేస్తుండగా చూసిన రవీంద్రబాబుమీద సుబ్బడు తేనెటీగల్తో ఉన్న పట్టుని చెట్టుమీదినించి పడేశాడు. ఆ తేనెటీగలు రవీంద్రబాబుని కరిచేశాయి. రవీంద్ర బాబు బనీనూ లుంగీతో తోటకు వెళ్లటం వల్ల ఆ తేనె టీగలు బాగానే కుట్టాయి. దాంతో ముఖం వాచిపోయింది. గుర్తుపట్టలేనంతగా తేనెటీగల పోట్లకి ముఖం ఉబ్బిపోయింది. ఆ బాధ రవీంద్రబాబు భరించలేకపోయాడు. ఏడ్చాడు, తిట్టాడు, సుబ్బడిని కొట్టబోయాడు. సుబ్బడు పారిపోయి తప్పించుకున్నాడు.

కొడుకు ఆ ముఖంతో ఇంటికి వచ్చిన తర్వాత చూసిన సూరయ్య, సంగతి తెలుసుకుని, సీతమ్మ ఇంటికి వెళ్లి, అప్పుడే తోటనుండి కావిడేసుకుని పొద్దు తిరిగిన వేళ ఇంటికి వచ్చిన సుబ్బణ్ణి చితక బాదాడు.

ఇప్పుడు తగువు...

ఉదయమే సీతమ్మ మామిడిపళ్లు అమ్ముకుని రావటానికి ఆ రోజు బజారుకు కాక టౌన్‌కు వెళ్లింది. వచ్చిన తర్వాత కొడుకు ఒంటిమీద దెబ్బలు, నెత్తురు మచ్చలు చూసి గుండెబాదుకుని ఏడ్చింది. ఏడుస్తూనే తిట్టింది. శాపాలు పెట్టింది. తన కొడుకును కొట్టిన ఆ చేతులు కుష్టురోగమొచ్చి కుళ్లిపోవాలని, తన కొడుకును కొట్టినందుకు ఆడి కొడుకుని కూడా భగమంతుడు కొట్టకపోతాడా అని నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టింది.

తిడుతూఏడ్చింది. వాళ్లకు తిండి లేదు. వంట లేదు. స్నానం లేదు. ఏడుస్తూనే ఉంది. చివరికి సాయంత్రం అయిదు గంటలప్పుడు ఇరుగు పొరుగు వాళ్లు తీసుకుని వెళ్లి స్నానం చేయించి ఆమెకీ, ఆమె కొడుక్కీ ఇంత అన్నం పెట్టారు.

ఇప్పుడు ఈ పెద్దల ముందుకు సర్పంచి ఇంటికి కొడుకును తీసుకుని వచ్చింది సీతమ్మ.

చుట్ట తాగుకుంటూ వచ్చాడు సూరయ్య. అదే వీధిలో సర్పంచి ఇంటికి పదిళ్లు పడమరగా ఉంటుంది సూరయ్య ఇల్లు.

సూరయ్య మదగజం నడిచినట్టుగా వచ్చి సర్పంచికి దగ్గర్లో అరుగుమీద రాట కానుకుని కూర్చున్నాడు. అందర్నీ ఒకసారి పలకరింపుగా చూసి ఒకరిద్దరిని కుశలప్రశ్నలు అడిగాడు. నిజానికి ఈ తగువుకీ తనకీ ఏ సంబంధమూలేనట్టు ఉంది సూరయ్య ప్రవర్తన. ఈ తగువు ఆ గ్రామానికి చెందింది అన్నట్టుగా ఉంది. ఆ కారణంగానే సూరయ్య ముఖంలో ఏ ఆందోళనా కనిపించలేదు. అతడు చుట్ట తాగుతున్న ఆనందంతో ఆనందోబ్రహ్మగా కనిపిస్తున్నాడు.

అక్కడి పెద్దమనుషులు మార్కెట్‌లో మామిడిపళ్ల ధరవరల గురించి చెప్పుకున్నారు. కొబ్బరికాయల మార్వాడీ మంచితనం గురించి మాట్లాడు కున్నారు. కొత్తగా బదిలీ అయి వచ్చిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ గురించి చెప్పుకున్నారు. పెళ్లిసంబంధాలు గురించికూడా చెప్పుకున్నారు. ఈ యోగక్షేమాలు ముగిసిన తర్వాత తగువు మొదలవుతుంది. అంతా ఒక పద్ధతి ప్రకారం అలవాటుగా జరుగుతుంది.

అంతలో పద్మావతమ్మ ఒక నవారు మంచాన్ని ఇంటిముందు వేయించింది. ఆ మంచంమీద ఒక బొంత పరిపించి ఒక తలగడ కూడా వేయించింది. సూరయ్యకి అరుగుమీద కూర్చోవటం ఇబ్బంది. ఆ బరువు శరీరానికి మంచం మీద కూర్చుంటేనే బావుంటుంది. దాంతో సూరయ్య ఆ మంచం మీదికి వెళ్లిపోయాడు.

పెట్రోమాక్స్‌లైట్ వెలుతుర్లో అందరూ విరామంగా ఒకరికొకరు కనిపించేట్టుగా కూర్చున్నారు.

ఇప్పుడు తగువు.

'ఒరే సుబ్బా,' అని సర్పంచి పిలిచి 'నీకూ రవీందర్ బాబుకీ మధ్యన ఏం జరిగిందో ఉన్నదున్నట్టు మాత్రమే సెప్పు. అబద్దం సెప్పినావంటే కళ్లు పేలిపోతాయి. ఇన్నావా, సెప్పు?' అని మెత్తమెత్తగా చురకత్తిని పదును పెడుతున్నట్టుగా నెమ్మది గొంతుతో అడిగాడు.

సీతమ్మ అడ్డుతగిలింది.

'నాయినా' అని సర్పంచిని చూసి, అక్కడ ఎక్కడా రవీందర్‌బాబు కనిపించక పోవడంతో 'తగువు తీరసడానికి ముందు రయీందర్ బావుని సబ ముందుకు పిలిపించాల' అంది.

సర్పంచి మాటాడలేదు. మౌనంగా విన్నాడు.

సూరయ్య తరపున సిమ్మాచెలం మాత్రం వెటకారంగా 'రయీందర్ బావు నీ కాడికొచ్చి సాచ్చెం చెప్పాలే... నీ కొడుకు సేసిన పనికి ఆ బావు మొకమంతా... వొళ్లంతా... వాసిపోయి తీతాపోటూ పెట్టి సచ్చిపోతుంతే...' సీతమ్మ మాటని కొట్టి పారేశాడు. రవీంద్రబాబు సభముందుకు రావలసిన పనిలేదని తేల్చేశాడు సిమ్మాచెలం.

సిమ్మాచెలం దురుసుతనం అందరూ ఎరిగినదే. ఆ దురుసుతనంతో సిమ్మాచెలం ఇప్పుడు మాట్లాడుతున్నాడు. ఆ మాటలు భయపెట్టున్నట్టుగా వినిపించాయి సీతమ్మకు.

సిమ్మాచెలం కళ్లు చాలా పెద్ద కళ్లు. గుడ్లగూబ కళ్లు అంటారు అంతా. ఊళ్లోని పెంకిపిల్లలు సిమ్మాచెలాన్ని గుడ్లగూబ అని కూడా పిలుస్తారు. అట్లాంటి గుడ్లగూబ కళ్లతో పెద్ద మనుషులు అందర్నీ తీక్షణంగా చూశాడు సిమ్మాచెలం. ముఖ్యంగా లచ్చుమయ్యని. పెద్దమనుషులంతా కూడా ఒకసారి లచ్చుమయ్య వేపు చూశారు.

లచ్చుమయ్య తల దించుకుని పరధ్యానంగా చూస్తున్నాడు. మెలితిరిగిన బొద్దుమీసాల వలన అతడిని మీసాల లచ్చుమయ్య అని కూడా ఊళ్లో వాళ్లు వ్యవహరిస్తారు. నూనెపెట్టినక్రాఫు వెలుతురుకు నల్లగా నిగనిగలాడుతున్నది. నుదుట ఎర్రటి సింధూరం గీతలా మెరుసున్నది.

సీతమ్మ మొగుడు జోగులు బతికినంత కాలం లచ్చుమయ్యను ఆశ్రయించి బతికాడు. జోగులుకు ఏ ఆపద వచ్చినా లచ్చుమయ్య ఆదుకునేవాడు. జోగులు చనిపోయినప్పుడు కూడా ఆస్పత్రి వైద్యానికి, చావు ఖర్చులకి లచ్చుమయ్యే ఆదుకున్నాడు. ఇప్పుడు సీతమ్మ పెంచుకుంటున్న మూడు గేదెల్ని లచ్చుమయ్యే కొని ఇచ్చాడు. సీతమ్మ తోటలో పడే కొబ్బరి కాయల్ని తను అప్పుగా ఇచ్చిన పైసలకి వడ్డీకింద జమ చేసుకుని సహాయ పడుతున్నాడు. మరొకడెవరన్నా అయితే ఆ భూమిని అసలు కింద ఎప్పుడో జోగులు బతికి ఉన్న రోజుల్లోనే రాయించుకునేవాడు. ఆ రోజుల్లో ఊళ్లో చిన్న చిన్న ఇరుగు పొరుగు తగువులు వచ్చినప్పుడు జోగులు పక్షాన నిలబడేవాడు లచ్చుమయ్య.

అట్లాంటి లచ్చుమయ్య ఇప్పుడు కనీసం పెద్దమనుషుల ముఖాల్లోకి చూడకుండా

కూర్చోవటం అక్కడి వాళ్లకు విచిత్రంగానే ఉంది.

లచ్చుమయ్య తనకి అభయంగా నిలుస్తాడని భావించిన సీతమ్మకు ఆశాభంగమయింది. ఇప్పుడు లచ్చుమయ్య ప్రవర్తన చూస్తే — పెద్ద మనుషులతో కలిసిపోతున్నట్టుగా అనిపించింది సీతమ్మకు. ఊళ్లో సూరయ్యను లెక్కచెయ్యని ఒకే ఒక మనిషి లచ్చుమయ్య. ఇప్పుడు నోరు విప్పకుండా కూర్చోవటం సీతమ్మకి అర్థం కాకుండా ఉంది.

'అయితే నాయినా, సర్పంచి బావూ, సబలో రయిాందర్ బావు లేకుండా తగువు తీరసటం నేయమేనా బావూ?' చిన్న గొంతుతోనే సీతమ్మ ఆ మాటలు అన్నా, అక్కడ ఉన్న అందరికీ ఆ మాటలు అవమాన పరుస్తున్నట్టుగా ఉన్నాయి. పెద్దమనుషుల మీద ఎదురుతిరుగుతున్నట్టుగా ఉందామె ప్రవర్తన.

నవారు మంచం మీద కూర్చున్న సూరయ్య చుట్ట తాగుతూ ఓ చేత్తో విసనకర్రతో గాలి వీచుకుంటున్నాడు. ఎండాకాలం. వేడి వేడి అన్నం తిని వచ్చాడేమో చెమటలు కారిపోతున్నాయి.

'సర్పంచి నిన్నుసెప్పమని అడగలేదే, సుబ్బడ్ని సెప్పమని అడగతన్నాడు. సుబ్బడు సెప్పాలే. నీవు మద్దినరాకు. ఇక్కడ పెద్దమనుసులున్నారు. ఇది పంచాయతీ. నోరు మూసుకుని యిను. కూకో పల్లక. సెప్పినదంతా యిను.' అని వెంకటస్వామి మంచి మాటలతో నెమ్మదిగానే అన్నాడు. ఆడమనిషి సబలోకి వచ్చింది. అవమానపరచకూడదు అని కూడా వెంకటస్వామి నెమ్మదిగానే మాట్లాడాడు.

అక్కడ చేరిన పెద్దమనుషులు అంతాకూడా ఊళ్లోతగువుల్లో ఒకరెవరన్నా దురుసుగా ప్రవర్తిస్తే వాళ్లను అడ్డుకోవాలన్న ఆలోచనతోను, పెద్ద మనుషుల మర్యాదను పాటించి, తగువు ఉద్రేకాలకు గురయి దారి తప్పిపోకుండా ఉండాలని శాంతపరచి మాట్లాడుతారు. వెంకటస్వామి ఇప్పుడు ఆ పాత్ర నిర్వహించాడు. వెంకటస్వామి గొప్ప భక్తుడు. అతడు ప్రతి ఏడాది జనాన్ని బస్సుల్లో తీర్థయాత్రలకు తీసుకుపోతూ ఉంటాడు. ఊళ్లో ఉన్నప్పుడు ప్రతి శనివారం శ్రీరామాలయంలోను, ప్రతి సోమవారం శివాలయంలోను భజనలు చేయిస్తాడు. తాను స్వయంగా మార్దంగికుడు. అతడు పూజలు ఉత్సవాలు తప్ప ఊళ్లో వేరే పని ఏదీ ముట్టుకోడు. ఆ రకంగా వెంకటస్వామికి మంచివాడనే పేరు ఊళ్లో ఉంది.

అయితే ఇప్పుడు వెంకటస్వామి మాటలు సూరయ్యకు సహాయపడినట్టుగానే ఉన్నాయి తప్ప సీతమ్మని ఓదార్చినట్టుగా మాత్రం లేవు. ఆ మాటల వెనక ఉన్న అర్థం

అందరికీ తెలిసిందే.

'రయీందర్ బావు మనిషయి కనబడతన్నాడా, వొల్లంతా పొంగిపోయి...' అని సూరయ్యని సమర్ధించేందుకు తాపత్రయ పడుతూ మాట్లాడాడు చెలమయ్య. ఈ తగువుకు రవీంద్రబాబుతో అసలు సంబంధమే లేదు అన్నది చెలమయ్య ఉద్దేశం. దొంగతనం చేస్తే తన్నక ఊరుకుంటారా అని అంతకు ముందే వాళ్లల్లో వాళ్లు అనుకున్నారు.

'నా కొడుకు వొళ్లంతా నెత్తురు మచ్చలు కనబడవా బావూ. ఇంత మంది మద్దికి మరి యీడిని పిలిపించినారా లేదా నాయినా. ఎలుగుబంటి సీరేసినట్టు నా కొడుకు వొళ్లంతా సీరేసినాడు కదా. పెదాలు కదపడానికేనా ఆడికి పేనమున్నాదా నాయినా'

గుండెలో దుఃఖాన్ని అణచుకోలేక చెప్పుకుంటున్న సీతమ్మ. ఆమె గొంతులోని దీనత్వం, ఆమె మనసులోని బాధ ఆ మాటలు పలకలేక పోతున్నాయి.

'నీవు మాటాడొద్దు. సుబ్బడిని అడగతన్నాడు సర్పంచ్ బావు. ఆడు సెప్పాల. నీవు నోరుమూసికొని యిను. పల్లకుండు' అని మళ్లీ చెలమయ్య వేట కుక్కలాగ అడ్డు తగిలాడు.

ఈ మాటలు వినికూడా లచ్చుమయ్య నోరు విప్పలేదు. సీతమ్మతో ఆర్నెల్లుగా లచ్చుమయ్యకి మంచయింది. అది చిన్నకులందే అయినా లచ్చుమయ్య దాని వెంటపడ్డాడు. జోగులు ఉన్న రోజుల్లో సైతం సీతమ్మ ఇంటిపనుల కోసం పిలిపించి నప్పుడల్లా వచ్చేది. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా సీతమ్మని పిలిపించుకునేవాళ్లు. జోగులు సరేసరి.

నోరు విప్పి సీతమ్మ పక్షాన ఒక్కమాట చెప్పినా రేచుకుక్కల్లా మిగిలిన పెద్దమనుషులు తనమీద పడతారని, రంకుముండా అని దాన్ని ఎక్కడ తిడుతారోనని, తన పరువు మర్యాద మట్టికలిసి పోతుందని లచ్చుమయ్య భయపడతూ ఉండవచ్చు. దానికి తోడు సూరయ్యకు ఎదురుగా సీతమ్మను ఇప్పుడు సమర్ధించటం అన్నది తనని తనే అవమానపరుచుకోవటం అవుతుంది. అందుచేత లచ్చుమయ్య ఇప్పుడు అక్కడ దోషిలాగ కూర్చున్నాడు. ఈ వ్యవహారాన్ని లచ్చుమయ్య ఎలా తట్టుకుంటాడో ఆసక్తిగా పరిశీలిస్తున్నారు మిగిలిన పెద్దమనుషులంతా.

పరిస్థితి మొత్తం అర్ధమయింది సీతమ్మకి. తనకు కావలసిన మనిషే నోరు మూసుకున్న తర్వాత ఇంకెవరు తనని కాపాడుతారు? దాంతో సీతమ్మ మనస్సు భగ్గుమని మండింది.

సర్పంచి మళ్లీ 'సుబ్బా, సెప్పురా సెప్పు, ఏం జరిగిందో ముందుసెప్పు. అబద్దం సెప్పకు. ఉన్నదున్నట్టు సెప్పు. అబద్దం సెప్పినావంటే కల్లు పేలి పోతాయి, సెప్పు' అన్నాడు మరొకసారి.

ఎండకాలం ఎండలకు అక్కడ ఉన్నవాళ్లంతా చెమటలు కక్కుతున్నారు. తువ్వాళ్లతో వొళ్లంతా తుడుచుకుంటున్నారు. ఆకు అల్లాడని ఎండాకాలం రాత్రి. వాళ్లకు ఈ చిన్న తగువు కోసం అక్కడ కూర్చోవటం కూడా ఇబ్బందిగానే ఉంది. ఏదో ఒకమాట అనేసి, నాలుగు చీవాట్లు పెట్టి, సూరయ్యకి యీసారికి చమించేయి బావు అని బతిమాలుకుని, దాని చేత దండాలు పెట్టించి తగువు తేల్చేయాలని సర్పంచి మనసులో ఉన్నప్పటికీ తగువు సాగటం లేదు.

సర్పంచికి నలభైయేళ్ళ కంటే ఎక్కువ వయసుండదు. లచ్చుమయ్య, చెలమయ్యల వయస్సుకూడా దాదాపు అదే. వాళ్లు ఎప్పుడూ ఇలాంటి తగువుల్లో ఇరుక్కోరు. వాళ్లల్లో వాళ్లకు పెద్ద పెద్ద సమస్యలే ఉన్నప్పటికీ అవి మాత్రం సర్పంచి దగ్గరకు రావు. ఊరుపెద్ద మనుషుల్లో లచ్చుమయ్య ఒకడు కావటం వల్ల ఇవాళ రావటం తప్పనిసరి అయింది. రాకుండా ఉంటే సీతమ్మకి ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఉద్దేశంతో వచ్చాడే తప్ప సీతమ్మ తగువులో జోక్యం చేసుకోటానికి కాదు. సీతమ్మతో తనకు మంచితనం అని ఊళ్లో అందరికీ తెలిసిందే. అందరికీ కాకపోయినా కొందరికన్నా అట్లాంటి కథలు ఉన్నవే. తను వాళ్ల మధ్య కూర్చున్నప్పుడు... వాళ్లు ఈ తగువులో కొంతన్నా మర్యాదగా ప్రవర్తిస్తారని కూడా లచ్చుమయ్య ఆశించాడు. ఇంతవరకు కథ ఆ పద్ధతిలోనే నడుస్తున్నది.

సుబ్బడు చెప్పటానికి నోరు విప్పబోతుంటే 'నీ వుండ్రా' అని కొడుకుని నోరు విప్పకుండా ఆపి 'సర్పంచి బావూ, రయీందర్ బావు పెద్దమనుసుల మద్దికి తేకపోతే యీ తగువు తీరదు. ఆ పిల్లడు సదువుకున్న పిల్లడు. బుద్దిమంతుడు. ఆడు సెప్పింది కూడా పెద్దమనుసులు యిని యీడిని అడగండి. అప్పుడు నా కొడుకు మాటాడుతాడు. అప్పుడు మీరు యీ తగువు తీరసండి' అని పెద్దమనుషుల మీద ఒక సవాల్ విడుస్తున్నట్టుగా చెప్పింది సీతమ్మ. ఆమెకి ఇప్పుడు ఒక తెగింపు వచ్చింది.

'ఈ తగువు తీరదు' అని సీతమ్మ పెడసరంగా మాటాడుతున్నందుకు సూరయ్యకు అవమానమయింది. కోపమొచ్చింది. 'ఆడు రాడంటే రాడు. నీవు నోరు మూసికొని పల్లకున్నావా సరే, లేదా ఏమవుతాదో నీకు తెలిసొస్తాది.' అని సూరయ్య సీతమ్మనీ, అక్కడున్న పెద్ద మనుషుల్ని కూడా బెదిరించాడు.

సీతమ్మ మొండిపట్టు పట్టింది. 'నా కొడుకు ఏమీ సెప్పడు. ముందు తగువు పెట్టింది రయీందర్ బావు. ముందు రయీందర్ బావు సెప్పాల. ఆ రయీందర్ బావు మీకు ఏం సెప్పినాడో అది సబముందుల సెప్పాల. అప్పుడుగాని నా కొడుకు నోరిప్పడు.' అని గట్టిగానే గొంతు పెద్దది చేసి మరీ చెప్పింది. సీతమ్మలో ఇప్పుడు పౌరుషం రేకెత్తింది. ఈ పెద్దమనుషులంతా ఏం చేస్తారు తనని, కొడతారా, కొట్టనీ. తిడతారా తిట్టనీ అని అన్నింటికి తెగిం చేసింది సీతమ్మ. ఆమె రవీంద్రబాబు రాకుండా తగువు నడపటానికి ఒప్పుకోలేదు.

సూరయ్యకి మంట ఎత్తుకొచ్చింది. సీతమ్మ బుఁరతిరుగుడు మాటలు భరించలేకపోయాడు. 'లంజముండా' అని పళ్లు పటపట కొరికాడు. సూరయ్య నోరు తిట్లతో నిండిపోయి ఆ కోపంతో నోరుతిరక్క ఆగిపోయాడు.

ఆ తిట్టు విన్నప్పుడు లచ్చుమయ్యని చూసింది సీతమ్మ. లచ్చుమయ్య తనే తప్పు చేసినట్టుగా కూర్చున్నాడు. సీతమ్మ రక్తం సలసల కాగింది. అక్కడినించి వాకిట్లోకి వచ్చి 'నా కొడుకు ఏ తప్పూ ఎరగడు. ఎవరి గడ్డిపోచా ముట్టుకొని ఎరగడు. నీ పాపిష్టి చేతుల్తో ఆడిని సగం తిన్నావ్. మిగిలిన సగం అందరూ కలిసి తినేయండి. ఆడిని వల్లకాట్లో పెట్టి పాతేయండి. ఆడిని సంపేసి బుగ్గి సేసేయండి. ఏం సేస్తారో సేసుకోండి. నోరుమూసికొని పల్లకొని ఇక్కడ నీను కూకోవాలా! నీ నేల యిక్కడ. నా గడపల కూకోని నా ఏడుపు నీను ఏడుస్తాను. రయీందర్‌బావు యిక్కడికి రాకపోతే యీ తగువు తీరసడానికి యీల్లేదన్నాను, యీల్లేదు. మీ పెద్దోల్లంతా కలిసి నా కొడుకును యేం సేసుకుంతారో సేసుకోండి.' అని అక్కడ పెద్దమనుషుల మీద ఎదురుతిరిగి, వెనక్కి చూడనన్నా చూడకుండా సీతమ్మ అక్కడనుండి తన ఇంటివేపు చరచరా వెళ్లిపోయింది. దాని కళ్లు కోపంతో అంతంతవైనాయి.

అది నోరు విప్పిందంటే చిన్నా పెద్దా చూడకుండా తిడుతుందని ఊళ్లో ఎరుగుదురు. ఆ గొంతు పెట్టుకునే అది ఆ ఊళ్లో బతకగలుగుతున్నది. వ్యాపారంలో దానికి రోజూ ఎక్కడో ఒక దగ్గర కొన్నదగ్గరో అమ్మిన దగ్గరో తగాదా వస్తూనే ఉంటుంది. అలాంటప్పుడు నోటి బలంతోనే నెగ్గుకొస్తున్నది సీతమ్మ.

సీతమ్మ గొంతు వీధి వీధంతా వినిపించింది. ఆ గొంతుకీ, ఆ తిట్లకీ, దాని కోపానికీ పెద్ద మనుషులకే ముందు భయమయింది. వాళ్లకి అవమానమయింది. వాళ్లకి అప్పుడు కోపం కూడా వచ్చింది.

పద్మావతమ్మకి కూడా ఆ గొంతు వినిపించింది. సీతమ్మ తిట్లు తిట్లులా

అనిపించలేదు. కొడుకుని తల్లి కాకపోతే ఎవరు కాపాడుకుంటారు. దాని తల్లి మనసు ఎంత బాధపడకపోతె అది అందరి ముందు అంత తెగిస్తుంది. అది మంచిపనే చేసింది, అక్కడ నుండి వెళ్లిపోయి... దాని పరువు అది కాపాడుకుంది. తేనె దొంగతనం... అని తగువు పెట్టటం పద్మావతమ్మకి ముందునించికూడా న్యాయంగా కనిపించలేదు.

'సీతమ్మా ఉండుండు. ఇటిను ఇటిను. ఎల్లకెల్లకు. ఇనిను. యినే. ఎల్లకే. సీతమ్మా సీతమ్మా. రాయే రాయే' అని పిలిచినా సీతమ్మ విన్లేదు. ఆగలేదు. వెనక్కి తిరిగి చూడలేదు.

అందరూ సీతమ్మ వెళ్లిపోతున్న దారివేపు చూశారు. తర్వాత లచ్చుమయ్యని చూశారు. లచ్చుమయ్య ముఖమెత్తి సీతమ్మ వేపు ఒకసారి చూసి చూపు దించుకున్నాడు. వెళ్లిపోతున్న తల్లిని సుబ్బడు చూశాడు. తల్లి వెంట లేచి వెళ్లిపోవాలనిపించింది వాడికి. కాని పెద్దమనుషుల భయంతో వాడు కదల్లేక పోయాడు. వాడి వొళ్లంతా పచ్చి పుండయి మంట పెడుతున్నది. గట్టిగా నేలమీద కూర్చుంటే ప్రాణం ఎగిరి పోతున్నట్టుగా ఉంది. ఏ చేతినీ కదపలేక పోతున్నాడు. ఇప్పుడు అక్కడంతా నిశ్శబ్దమయింది. వాళ్లందరితోపాటే వాడుకూడా నోరు మూసుకుని కూర్చున్నాడు.

పెద్దమనుషుల దగ్గర నోరు ఎత్తటమే కష్టం. వాళ్లముఖాల్లోకి చూట్టానికి కూడా ధైర్యం చాలదు. పెద్దమనుషులు ఏది చెప్తే అది విని, ఏది చేయమంటే అదిచేసి — తిడితే భరించి, కొడితే భరించి, పిడికిట్లో ప్రాణాలు పెట్టుకు బతుకుతున్నారు ఆ ఊళ్లో జనం. ఆ ఊరి చరిత్రలో, తమకు గుర్తున్నంత వరకు, తగువు తీరుస్తున్నప్పుడు పెద్ద మనుషులమీద ఎప్పుడూ ఎదురు తిరిగిన మనిషి కనబడలేదు. అలాంటిది ఈ రోజు ఒక చిన్నకులం ఆడమనిషి పెద్దమనుషులు అందర్నీ ఒకటి చేసి తిట్టిపోసి ఎందరు పిలిచినా ఆగకుండా, లెక్కచెయ్యకుండా అక్కడ నుండి లేచివెళ్లిపోయింది.

సూరయ్యకి తలవొంపయింది. కోపంతో సూరయ్య ఇప్పుడు మండిపోతున్నాడు. 'అది కాదురా. ఈ తగువు నీవు తీరుస్తావా లేకపోతే నాకు సేతకాదంతావా? ఏదో ఒకమాట సెప్పు. నీ సేతకాకపోతె నాకొదులు. నా సేతయిందేదో నేను సేసి చూపుతాను' అన్నాడు.

సర్పంచి వయస్సులో సూరయ్య కన్న చిన్నవాడు. ఆస్తిలో చిన్నవాడు. వరసకి సూరయ్యకి కొడుకు అవుతాడు. ఆ పెద్దరికంతోనే కాకుండా సర్పంచికి పెద్ద అండగా

నిలబడి నడిపిస్తున్నాడు. ఆ అధికారంతోనే ఇప్పుడు సూరయ్య గొంతు పెద్దదిచేసి మరీ మాట్లాడాడు.

సర్పంచికి దారి తోచలేదు.

సిమ్మాచెలం అంతలో అందుకుని 'అది ఎల్తే ఎల్లింది, దానితో పనేమిటి? ఆడున్నాడు. ఆడిని అడిగేస్తే తేలిపోతాది కదా? ఆడినే అడిగేయి' అన్నాడు సర్పంచితో.

'సుబ్బడితో తగువా సీతమ్మతో తగువా? ఆడున్నాడు. ఆడుసెప్తే సరిపోదా?' అని సిమ్మాచెలం పెద్దలందరికీ వినిపించేట్టు మళ్లీ అన్నాడు.

సర్పంచి మరోసారి సుబ్బణ్ణి ఏం జరిగిందో చెప్పమని అడిగాడు.

'నాను దొంగలాడ లేదు' అన్నాడు సుబ్బడు.

'ఊ సెప్పు'

'నాను దొంగలాడలేదు.' అన్నాడు మళ్లీ.

'రయీందరే ఆళ తోటకి తీసికెల్నాడు. ఆడురమ్మంతే ఎల్లినాను. నాను గీదలని కడగతున్నప్పుడు ఆడు ఆళ తోటకి ఎల్తూ మా పందిరి కాడ నిలబడ్డాడు. ఆళ తోటకి రమ్మని పిలిస్నాడు. నా పనయిందాకా వాడు మా పందిరికాడే ఉన్నాడు. నా పనయింతరాత ఆడితో ఎల్నాను. నీను సెప్పింది సత్తిమో కాదో రయీందర్‌ని పిలిసి అడగండి' అని సుబ్బడు ఆగాడు.

'తరాత ఏం జరిగిందో సెప్పు' అన్నాడు నారాయణ

'తరాత ఆళ తోటకి ఇద్దరం ఎల్నాము. ఆ సెప్పటం మరిసిపోయినాను. ఆడు మా పందిరికాడ నిలబడినప్పుడు ఆడికి పచ్చి సీడిగుడ్లు (జీడిపప్పు) వొలిసి యిచ్చినాను. రయీందర్ తిన్నాడు. ఆడికి ఒక మామిడిపండు కూడా కోసిచ్చినాను. తిన్నాడు. రయీందర్ ఆళ తోటలో సెట్టు తొర్రల తేనె పట్టున్నాది వచ్చి తియ్యాల అన్నాడు. సరే అని ఎల్నాను. ఆళ కంబార్లు ఉంటే ఆళే తీస్తార్లే అనుకున్నాను. ఆళ కంబార్లు ఇంటికి ఎలిపోయినట్టున్నారు. ఆళు ఎవళ్లు కనబడలేదు. మావిడిసెట్టుమీది పై కొమ్మకి ఒక పెద్ద పట్టే ఉన్నాది. దాని పక్కన ఒక సిన్న పట్టుకూడా కనబడ్డాది. మీది కొమ్మకి ఎక్కటం కసింత కస్టమే. అన్నీ సజ్జేసినాను. ఉట్టిలో పెట్టి పట్టు కిందికి దించాల. కింద ఒక గంపల అంటాకులుంచినాను. పట్టు తీస్తున్నప్పుడు తేనీగలని దులపతుంటే ఒక ముక్క ఇరిగి రయీందర్‌మీద పడ్డాది. ముక్క కింద యిసకల పడలేదు. గంపల పడ్డాది. ఆ యీగలు రయీందర్‌ని పొడిసేసినాయి. అమ్మో అయ్యో అని ఆడు ఏడిసినాడు. అక్కడనుండి ఆడు ఎలిపోయినాడు. ఆ తేని అక్కడ వొదిలేస్తే

పోతాదని, ఆ పట్లన్నీ మా పందిరి కాడికి తెచ్చినాను'

'అక్కడాపు' అన్నాడు వెంకటస్వామి

అరుగుమీది తేనె ముంతచూపించి సర్పంచి 'ఇది నీవు తెచ్చిన కలశమేనా' అని అడిగాడు.

'వూ'

'మీదేనా?'

'మాదే'

'నీవు సెప్పిందంతా సత్తెమేనా?' అడిగాడు నారాయణ.

'సత్తెమే'

'అబద్ధం సెప్పకు కళ్లు పేలిపోతాయి'.

'సత్తిమే సెప్పినాను'

'లంజకొడకా, అబద్ధం సెప్తన్నావ్. నిజం సెప్పు. నీవు సెట్టుమీది తేని దొంగలాడతుంటే —రయీందర్ బావు ఒచ్చి సూసి, కేకేస్తే —రయీందర్ బావు మీదికి యీగల్తో తేనెపట్టుని యిసిర్నావా లేదా —అబద్ధం సెప్పకు కల్లు పేలిపోతాయి' అని భయపెట్టి బెదిరించి మరీ అడిగాడు ఈసారి సిమ్మాచెలం.

సుబ్బడు ఆశ్చర్యపోయాడు. రవీందర్‌బావు చదువుకున్నవాడు అబద్ధం ఆడుతాడా అని కూడా సుబ్బడు ఆశ్చర్యపోయాడు.

'రయీందర్ బావుని మీ కాడికి తీసికొస్తా నుండండి. పెద్దల మద్దిన అందరి ముందు ఆ మాట సెప్పమనండి' అని సుబ్బడు ఒంటినొప్పులకు గింజుకుంటూ లేచి నిలబడ్డాడు. నిలబడ్డాడే కాని అడుగుతీసి అడుగు వెయ్యలేకపోయాడు.

వాడి వొళ్లు బలంగా ఉంది. వాడి ఛాతి వెడల్పుగా ఉంది. వాడి చేతులకు కండరాలున్నాయి. వాడి ముఖం వెడల్పుగా ఉంది. వాడి గొంతు మగ గొంతయింది. వాడి మీసాలు ఇప్పుడిప్పుడే నల్లబడుతున్నాయి. వయస్సు పదహారు పదిహేడేళ్లే అయినా వాడు ఇరవైయ్యేళ్లవాడిలా కనబడుతాడు. కావిడి మోసి మోసి వాడి శరీరం రాటు తేలింది.

సుబ్బడు లేచి అడుగుతీసి అడుగుముందుకు వెయ్యలేకపోవటం నారాయణ చూసి 'రయీందర్ బావుని తీసుకొస్తాం, నీ వుండు' అని ఆపి, 'కూకో కూకో' అన్నాడు.

సుబ్బడి వీపు మీద తగిలిన దెబ్బలమీద నారాయణ చెయ్యిపడి నొప్పి రేగింది.

'రయీందర్ బావుని పిలిసికొస్తే ఆడుసెప్పిందీ యినొచ్చుకదా. ఆడు

సదూకున్నోడు. ఆడి నోటిమాట పెద్ద మనుషుల యినేస్తే తగువు తీరిపోతాది కదా' అని సవినయంగా చెప్పాడు నారాయణ.

ఆ ఊళ్లో ఇలాంటి తగువుల్లో పెద్దల మీద పేదలు ఎప్పుడూ గెలవలేరు. అది సుబ్బడికి తెలుసు. అందులోనూ సూరయ్య అంతటి పెద్దరైతు మీద సీతమ్మ గెలవలేదు. అయినా తగువుకు పిలిచిన తర్వాత రాక తప్పదు కాబట్టి వచ్చింది. రవీంద్రబాబు సభకు వస్తే నిజం చెప్తాడని, లచ్చుమయ్య తన తరఫున న్యాయం మాటాడుతాడని సీతమ్మ ఆశించి వచ్చింది. ఊరి పెద్దల కుతంత్రాలు ఊళ్లో జనానికి తెలిసినవే. సీతమ్మకీ తెలిసినవే. దోషం నిర్ధారించి పెద్దలు 'తప్పు' వేస్తారు. ఆ 'తప్పు' మొత్తం వందలరూపాయల్లో ఉంటుంది. ఆ డబ్బు చెల్లించకపోతే ప్రోనోటు రాయించుకుంటారు. భూములు అమ్మించో, యిల్లు అమ్మించో, లేదా వాళ్ల గొర్రెల్నో, మేకల్నో, ఆవుల్నో, గేదెల్నో అమ్మించో, బండీ ఎడ్లూ ఉంటే వాటిని అమ్మించో, తప్పుగా విధించిన ఆ మొత్తాన్ని వసూలుచేస్తారు. దానికి భయపడే సీతమ్మ అక్కడ ఉండకూడదని వెళ్లిపోయింది.

ఇప్పుడు నారాయణ చెప్పిన తర్వాత 'సిమ్మాచెలం, నీ వెల్లి రవీంద్ర బాబుని తీసుకొన్రా' అన్నాడు సర్పంచి.

సూరయ్య వేపు ఒకసారి చూసి, సూరయ్య దానికి అభ్యంతరం చెప్పటం లేదని గ్రహించి సిమ్మాచెలం వీధి పడమటిదిక్కుగా వెళ్లాడు.

'సీతమ్మని రమ్మను, ఎల్లు' అని చంద్రయ్యవేపు చూశాడు సర్పంచి.

సీతమ్మ దగ్గరకు వెళ్లటం చంద్రయ్యకి ఇష్టం లేదు. కాని ఇట్లాంటి సమయంలో వెళ్లక తప్పదు. చంద్రయ్య వీధి తూర్పు దిక్కుగా సీతమ్మ ఇంటి వేపు వెళ్లాడు.

కొబ్బరి తోటల మధ్య దాక్కుని ఉన్నట్టుగా ఉంటుందా ఊరు. చుట్టూ తోటలే తోటలు. అట్లాంటి తోటల మధ్య ఉన్నప్పటికీ ఇప్పుడు గాలి ఆడటం లేదు. చెట్ల ఆకులు నిశ్శబ్దంగా మ్రాన్పడినట్టున్నాయి. తోటల్లో నక్కల ఊళలు మాత్రం మధ్య మధ్య వినిపిస్తున్నాయి. ఆ ఊరికి వేకువజామున సముద్రపు హోరు కూడా వినిపిస్తుంది.

ఎక్కడో కుక్కల అరుపులు...

పెద్దలు అంతా కొంచెంసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు. వాళ్లంతా ఆలోచనల్లో నిండా మునిగిపోయినట్టుగా ఉన్నారు.

రవీంద్రబాబుని తీసుకుని సిమ్మాచెలం వచ్చాడు. రవీంద్రబాబు వెళ్లి సర్పంచికి దగ్గర్లో పెద్దమనుషుల మధ్య కూర్చున్నాడు. పెద్దమనిషిలా కూర్చున్నాడు. తెల్లటి

గళ్లలుంగీ, తెల్లటి చొక్కా తేనెటీగలు కుట్టిన సాక్ష్యంగా వాచిపోయిన ముఖం.

అందరి ముఖాల్లోనూ రవీంద్రబాబు పట్ల అభిమానం కనబడుతున్నది.

'మీ పరీక్షలు ఎప్పుడు తెలుస్తాయి' అడిగాడు సర్పంచి.

పదకొండో తరగతి పబ్లిక్ పరీక్ష రాశాడు రవీంద్రబాబు. అయితే రవీంద్ర బాబు పరీక్షలు ముగిసిన వెంటనే ఊరికి రాలేదు. వాళ్ల అమ్మమ్మగారి ఊరెళ్లాడు. అక్కడ రెండు మూడు వారాలు గడిపి వచ్చాడు.

'వారం పదిరోజుల్లో వస్తాయి రిజల్స్' అన్నాడు రవీంద్రబాబు.

రవీంద్రబాబుని చూశాడు సుబ్బడు.

తూర్పునించి చంద్రయ్య ఒక్కడే వచ్చాడు. సీతమ్మ రాలేదు.

'ఏదిరా అది!' సర్పంచ్

'రానన్నాది. పేరు పేరున పెద్ద మనుషుల్ని తిట్టిపోస్తన్నాది.' అన్నాడు చంద్రయ్య. నిజానికి సీతమ్మ చంద్రయ్యని తిట్టింది. సీతమ్మతో మోటు సరసం చేసి ఇదివరలో తిట్లు తిన్నవాడే చంద్రయ్య. వాడి ముఖాన ఇప్పుడు ఉమ్మేసింది.

ఇంక రయీాందర్ బావుని ఏమీ అడగవలసిన పని లేదని తేల్చేశారు పెద్దలు.

సూరయ్య తోటలో తేనె దొంగలించటం సుబ్బడు చేసిన ఒకటో తప్పు. రవీంద్ర బాబు ఆ దొంగతనం చూసి అడిగినప్పుడు రవీంద్రబాబు మీదికి తేనెపట్టును పడేయటం రెండో తప్పు. ఆ తేనెని అక్కడ వాళ్ల మామిడి చెట్టుకిందే వదిలేయకుండా తన ఇంటికి తెచ్చుకోవటం మూడో తప్పు. దొంగతనం చేసినందుకు సుబ్బడిని సూరయ్య కొడితే ఆడి తల్లి సీతమ్మ సూరయ్యని తిట్టటం నాలుగో తప్పు. తగువుకు వచ్చి పెద్ద మనుషుల్ని ఎదిరించటం అయిదో తప్పు. ఊరి పెద్దమనుషుల్ని నిందించి తిట్టటం ఆరో తప్పు. పెద్దలు పిలుస్తున్నా లెక్కచేయకుండా వెళ్లిపోవటం ఏడో తప్పు. రమ్మని మనిషిని పంపించి పిలిపిస్తే సర్పంచి ఇంటికి రాకపోవటం ఎనిమిదో తప్పు. వెళ్లిన చంద్రయ్యని, పెద్దమనుషుల్ని కలిపి పేరుపేరునా తిట్టటం తొమ్మిదో తప్పు. తప్పు అయిపోయిందని పెద్దమనుషుల్ని బతిమాలుకోక పోవటం పదో తప్పు. క్షమించమని సర్పంచి పాదాలు పట్టుకోలేదు. అదో తప్పు. అలా లెక్క వేసుకుంటూ పోతే సీతమ్మ, సుబ్బడూ చేసిన తప్పులు సంఖ్య పెరుగుతుందే తప్ప తరగదు.

ఈరోజు తేనెపట్టు అయింది. రేపు తోటల్లోపడి కొబ్బరికాయలు దొంగ లాడుతారు. పనసపళ్లు దొంగలాడుతారు. మామిడిపళ్లు దొంగలాడుతారు. జీడిపిక్కలు దొంగలాడుతారు. అరటిగెలలు దొంగలాడుతారు. ఎల్లుండి ఇళ్లల్లోపడి దొంగతనాలు

చేస్తారు. ఇది ఇలాగ జరిగిపోతే మనుషుల ప్రాణాలు తీస్తారు.

అందుచేత ఇలాంటి వాళ్లకి ముందే తగినశిక్ష పడాలి. ముందే జాగ్రత్తపడాలి.

'నీవు ఎల్లిపోరా' అని సుబ్బడిని అక్కడినుండి పంపించేశారు.

సుబ్బడు కుంటుకుంటూ అక్కడనుండి తమ ఇంటి దిక్కుగా వెళ్లిపోయాడు.

లచ్చుమయ్య అంత జరిగిన తర్వాత కూడా నోరెత్తలేదు. ఊళ్లో చుట్టరికాలనీ, బంధుత్వాలనీ, పెళ్లయి ఇరుగు పొరుగు ఊళ్లల్లో ఉన్న కూతుళ్లనీ, ముందు ముందు పెళ్లిళ్లు చేయవలసి ఉన్న కొడుకుల్నీ, పెద్దకులం పరువునీ, ప్రతిష్టనీ గురించి ఆలోచిస్తూ కూర్చున్నట్టు గంభీరంగా ఉన్నాడు. తర్వాత పెద్దమనుషులంతా లేచి నుంచున్నప్పుడు తను కొత్తగా కట్టించుకున్న పెంకుటింటివేపు నెమ్మదిగా తలదించుకుని వెళ్లిపోయాడు లచ్చుమయ్య.

* * *

స్వాతి మాస పత్రిక
అక్టోబర్ *1970*